సాక్షి
పల్నాడు
మంగళవారం । 22 । ఆగస్టు । 2023



ఘనంగా పోలేరమ్మ తిరునాళ్ల

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ రూరల్ మండలం ఉప్పరపాలెం గ్రామ పోలేరమ్మ తిరునాళ్ల సోమవారం నిర్వహించారు. ఎమ్మెల్యే బొల్లా పూజలు నిర్వహించారు.



వైద్య కళాశాలలో స్పోర్ట్స్ వీక్

గుంటూరుమెడికల్: గుంటూరు వైద్య కళాశాలలో స్పోర్ట్స్ వీక్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ నీలి ఉమాజ్యోతి సోమవారం ప్రారంభించారు. అనంతరం చెస్ ఆడారు.



నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి:దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి విజయవాడ కేటీరోడ్డుకు చెందిన ఎస్.పరాస్ కుటుంబం సోమవారం రూ.లక్ష విరాళం సమర్పించింది.

పంచాయతీల్లో డిజిటల్ చెల్లింపులు

- నగదు రహిత లావాదేవీల దిశగా అడుగులు
- అక్రమాలకు చెక్
- అమలులోకి వచ్చిన విధానం
- జిల్లాలో 527 గ్రామ పంచాయతీలు

సత్తెనపల్లి: జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో నగదు రహిత లావాదేవీల నిర్వహణ దిశగా అడుగులు పడుతున్నాయి. ఇకపై అన్ని పంచాయతీల్లో పన్నులను డిజిటల్ విధానంలో మాత్రమే చెల్లించాలని ప్రభుత్వం ఇటీవల ఆదేశాలు జారీ చేసింది. ఈ విధానం దేశవ్యాప్తంగా ఈనెల 15వ తేదీ నుంచి అమల్లోకి వచ్చింది. జిల్లాలో 527 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. పన్ను వసూళ్లలో అనేక పంచాయతీల్లో అనేక అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. గ్రామ పంచాయతీలకు పన్నుల రూపంలో వస్తున్న ఆదాయాన్ని కొన్ని చోట్ల సిబ్బంది, అధికారులు నిబంధనలు ఉల్లంఘించి దుర్వినియోగం చేస్తున్నారు. మరికొన్ని చోట్ల ప్రజల నుంచి వసూలు చేసిన పన్నులను సిబ్బంది సొంత అవసరాలకు వాడుకుంటున్నారు. పంచాయతీ ఆదాయాన్ని నకిలీ రసీదుల ద్వారా కాజేస్తున్న ఘటనలు కూడా ఉన్నాయి. ఇలాంటి ఘటనలపై ఉన్నతాధికారులకు తెలిసినా తనిఖీలు నిర్వహించి మమ అనిపించడం తప్ప పూర్తిస్థాయి రికవరీ చేయలేని పరిస్థితులు ఉన్నాయి. ఇలాంటి అక్రమాలకు చెక్ పెట్టేందుకే డిజిటల్ చెల్లింపుల పద్ధతి ప్రవేశ పెట్టారు.

- గ్రామ పంచాయతీల్లో ఇంటి, కుళాయి పన్నులు, భవనాల అద్దె, లేఅవుట్, భవన నిర్మాణ తదితర అనుమతులకు రుసుములను డిజిటల్ విధానంలోనే చేయాల్సి ఉంటుంది. జిల్లాలో ఈ విధానాన్ని స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 15న లాంఛనంగా ప్రారంభించారు.
- కేంద్ర ప్రభుత్వం పంచాయతీలకు విడుదల చేసే ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి గతేడాది యూనియన్ బ్యాంకులో ప్రత్యేక ఖాతాలు తెచ్చారు. కేంద్రం నేరుగా పంచాయతీల ఖాతాలకు నిధులు జమ చేయనుంది. ఈ బ్యాంకు ఖాతాలకు గూగుల్ పే, ఫోన్ పే యాప్‌లను అనుసంధానించారు. పన్నుల వసూలు సమయంలో యాప్‌లకు సంబంధించి క్యూఆర్ కోడ్ ముద్రించి యూపిన్ కాగితాలను సిబ్బంది వెంట తెచ్చుకుంటారు. స్థానికులు పంచాయతీలకు చెల్లించాల్సిన పనులను క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం ద్వారా నేరుగా నగదు పంచాయతీ బ్యాంకు ఖాతాకు జమ అవుతుంది. స్మార్ట్‌ఫోన్ లేని వారు పంచాయతీ బ్యాంకు ఖాతాకు లేదంటే ఇతరుల ఫోన్ నుంచి చెల్లించవచ్చు. పంచాయతీలో నిర్వహించే ఏపనికైనా ఇదే విధానంలో చెల్లించాల్సి ఉంటుంది.



గోళ్లపాడు సచివాలయం



ధూళిపాళ్లలో క్యూఆర్ కోడ్‌తో డిజిటల్ చెల్లింపులు చేసిన రాయపాటి పురుషోత్తమరావు

పారదర్శకత పెంచేందుకే



గ్రామ పంచాయతీల నిర్వహణలో పారదర్శకత పెంచేందుకు డిజిటల్ చెల్లింపుల విధానాన్ని ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. తద్వారా పంచాయతీల్లో నిధుల దుర్వినియోగానికి అడ్డు కట్టపడుతుంది. బ్యాంక్ అధికారులు కూడా పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ప్రజలకు కూడా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. నూతన విధానాన్ని అందరూ అలవాటు చేసుకోవాల్సిందే.

– జీవీ సత్యనారాయణ, ఎంపీడీవో, సత్తెనపల్లి.

యార్డుకు 35,833 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 35,833 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 32,855 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి రూ.24,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి 26,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.11,000 నుంచి రూ.23,500 వరకు పలికింది.

కొండవీడును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతా

- జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి
- డీఎఫ్‌వో ఎన్ రామచంద్రరావుతో కలిసి కొండవీడుకోట సందర్శన

యడ్లపాడు: చారిత్రక పాశస్త్యం కలిగిన కొండవీడు కోటను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని పల్నాడు జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. యడ్లపాడు మండలం కొండవీడుకోట ప్రాంతాన్ని సోమవారం జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. పల్నాడు జిల్లా అటవీశాఖ అధికారి ఎన్ రామచంద్రరావు కొండవీడుకోట నగరవనంలో భాగంగా కొండపై జరుగుతున్న పలు అభివృద్ధి పనులను గురించి జిల్లా కలెక్టర్‌కు వివరించారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో పర్యాటక ప్రాంతంలో పచ్చదనం పెంపొందించే విషయంపై అటవీశాఖ దృష్టి సారించాలన్నారు. పర్యాటక పరంగా అక్కడికి వచ్చిన సందర్శకులతో కొద్దిసేపు ముచ్చటించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సెప్టెంబర్ 15వ తేదీ నాటికి కొండపై చేస్తున్న అభివృద్ధి పనులు, అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటవుతున్న సాహస క్రీడల్ని సందర్శకులకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ డీఎఫ్‌వో రామచంద్రరావుకు సూచించారు. పర్యాటక దినోత్సవ వేడుకల్ని కొండపై నిర్వహించుకునేలా చూడాలన్నారు.



కొండలపై పర్యటిస్తున్న జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి, డీఎఫ్‌వో ఎన్ రామచంద్రరావు

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి

- జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్
- జగనన్నకు చెబుదాంలో 251 అర్జీలు స్వీకరణ

నరసరావుపేట: ప్రజల సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఏ.శ్యామ్‌ప్రసాద్ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్పందన హాలులో సోమవారం జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా తరలి వచ్చిన వారి నుంచి జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకంతో కలిసి 251 అర్జీలను స్వీకరించారు. వాటిని సంబంధిత శాఖల అధికారులకు పంపి వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ దాతలు ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించగా వారిని జిల్లా జాయింట్ కలెక్టర్ అభినందించి సత్కరించారు. ఏఓ అనీల్ కుమార్, జిల్లా, మండల అధికారులు పాల్గొన్నారు.



అర్జీదారుల సమస్యలు వింటున్న జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు స్థలం మంజూరు చేయండి

మా గ్రామంలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు స్థలం మంజూరు చేయాలి. అంబేడ్కర్ విగ్రహాన్ని కేవలం మాలపల్లిలో ఏర్పాటుచేసుకోవాలనటం దారుణం.

– దళితులు, చాగంటివారిపాలెం, ముప్పాళ్ల మండలం

నేడు సత్తెనపల్లిలో బీసీ గర్జన

- ఏర్పాట్లు పూర్తి
- హాజరుకానున్న ప్రజాప్రతినిధులు

సత్తెనపల్లి: రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం 4 గంటలకు పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని శరభయ్య గుప్తా హిందూ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో నియోజకవర్గస్థాయి బీసీ గర్జన నిర్వహించనున్నారు. ఈ గర్జనతో ఎన్నికల శంఖారావం పూరించనున్నారు. ఇటీవల గుంటూరు మిర్చి యార్డు చైర్మన్‌గా నియమితులైన నిమ్మకాయల రాజనారాయణ, విద్యాభివృద్ధి మౌలిక వసతుల కల్పన కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన యనమాల నాగార్జున యాదవ్‌కు సన్మానం చేయనున్నారు. ఈ క్రమంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబుతోపాటు పల్నాడు జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాచర్ల శాసనసభ్యుడు, పల్నాడు జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్యేలు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నంబూరు శంకరరావు, కాసు మహేష్ రెడ్డి, బొల్లా బ్రహ్మనాయుడు, ఎమ్మెల్సీ చంద్రగిరి యేసురత్నం, వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్ తదితరులు హాజరుకానున్నారు.



సభాస్థలిలో బారికేడ్లు, లైటింగ్ ఏర్పాటు చేస్తున్న కార్మికులు

25 నుంచి ఎస్‌ఐ అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు

ఏర్పాట్లు పరిశీలించిన గుంటూరు జిల్లా ఎస్పీ

నగరంపాలెం: ఈనెల 25 నుంచి పోలీస్ పెరేడ్ గ్రౌండ్స్‌లో జరగనున్న ఎస్‌ఐ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షల ఏర్పాట్లను సోమవారం జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ పర్యవేక్షించారు. పోలీస్ నియామక ప్రక్రియలో గుంటూరు రేంజ్ పరిధిలో ఎస్‌ఐ ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఫిజికల్‌కు సంబంధించి పరీక్షలు జరగనున్నాయి. ఈ క్రమంలో మైదానంలో ఏర్పాట్లపై పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఎటువంటి పొరపాట్లు దొర్లకుండా సాంకేతిక పరిజ్ఞానంతో కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. దేహదారుఢ్య పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు వెరిఫికేషన్‌కై ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరవ్వాలని ఎస్పీ తెలిపారు. ఎస్పీ వెంట ఏఎస్పీలు (తూర్పు) నిచికేష్ షెల్కే, సుప్రజ (పరిపాలన), కె.కోటేశ్వరరావు (ఏఆర్), డీఎస్పీలు ఉమామహేశ్వరరెడ్డి, మహబూబ్‌బాషా, బాలసుందరరావు, సీఐలు, ఆర్‌ఐలు పాల్గొన్నారు.



అధికారులకు సూచనలు చేస్తున్న ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్

23 శాతం ఫిట్‌మెంట్ అమలుపై హర్షం

సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

రేపల్లెరూరల్: రాష్ట్రంలోని సెర్ప్ ఉద్యోగులకు 23 శాతం ఫిట్‌మెంట్ అమలుచేస్తూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకోవటం ఆనందదాయకమని సెర్ప్ జేఏసీ చైర్మన్ కొమ్ము నాగరాజు అన్నారు. సోమవారం పట్టణంలోని ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు వ్యక్తిగత కార్యాలయంలో ఆయన్ని కలసి సెర్ప్ సిబ్బంది పుష్పగుచ్ఛాన్ని అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు. సెర్ప్ సిబ్బందికి పేస్కేల్ అమలు చేయాలని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని ఎంపీ మోపిదేవిని కోరారు. స్పందించిన ఎంపీ మోపిదేవి మాట్లాడుతూ సెర్ప్ సిబ్బంది వినతిని జగనన్న దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా కృషి చేస్తానని హామీనిచ్చారు. అనంతరం సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సీహెచ్ సాల్మన్, పూర్ణా, కోటేశ్వరరావు, దాసు,శిరీష, నాగకుమారి, మేరి, దేవీప్రసన్న, నూరున్నీసా తదితరులున్నారు.



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న సెర్ప్ సిబ్బంది, చిత్రంలో ఎంపీ మోపిదేవి

సముద్రంలో గల్లంతైన వారి మృతదేహాలు లభ్యం

నిజాంపట్నం(రేపల్లె): బాపట్ల జిల్లా, నిజాంపట్నం హార్బర్ సమీపంలో ఆదివారం మరబోటు బోల్తా పడిన ఘటనలో గల్లంతైన ముగ్గురి మృతదేహాలు లభ్యమయ్యాయని ఎస్‌ఐ రమేష్ తెలిపారు. నిజాంపట్నం తీరానికి మృతదేహాలు సోమవారం కొట్టుకువచ్చాయన్నారు. కృష్ణాజిల్లా నాగాయలంక మండలం ఈలచెట్లదిబ్బ గ్రామానికి చెందిన కొక్కిలిగడ్డ సోంబాబు తన భార్య సాయివర్ణిక(29), ఇద్దరు కుమారులు తనిష్‌కుమార్(9), తరుణేశ్వర్(11నెలలు)లను వెంట తీసుకుని తన గ్రామం నుంచి అత్తవారి ఊరైన ముత్తాయిపాలెంనకు వేట చేసుకుంటూ బయలుదేరాడు. వేటలో దొరికిన మత్స్య సంపదను నిజాంపట్నంలో విక్రయించుకుని వెళ్లేందుకు హార్బర్‌కు వస్తున్న సమయంలో మొగ వద్ద అలలు ఉధృతంగా ఉండటంతో బోటు బోల్తాకొట్టింది. ఈ ప్రమాదంలో సోంబాబు భార్య సాయివర్ణిక, కుమారులు తనిష్ కుమార్, తరుణేశ్వర్ గల్లంతయ్యారు. అదే సమయంలో సోంబాబు సముద్రంలో ఈదుతుండగా దగ్గరలో వేట చేస్తూ వస్తున్న మత్స్యకారులకు కనిపించటంతో అతన్ని రక్షించారు. గల్లంతైన ముగ్గురి కోసం మెరైన్ పోలీసులు, గజ ఈతగాళ్లు గాలింపు చర్యలు చేపట్టారు. తరుణేశ్వర్ మృతదేహం నిజాంపట్నం హార్బర్ సమీపంలో మత్స్యకారులు ఏర్పాటు చేసిన వలలకు చిక్కుకుని కనిపించగా, సాయివర్ణిక, తనిష్ కుమార్ మృతదేహాలు నిజాంపట్నం హార్బర్ సమీపంలో బాపట్ల తీరం వైపునకు కొట్టుకువచ్చాయి. మృతదేహాలకు పంచనామా నిర్వహించిన అనంతరం పోస్టుమార్టం నిమిత్తం రేపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ రమేష్ తెలిపారు.

సంఘటన స్థలాన్ని సందర్శించిన ఎంపీ మోపిదేవి

హార్బర్ సమీపంలో మరబోటు బోల్తా పడి ముగ్గురు మృత్యువాత పడిన సంఘటన హృదయ విదారకమని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. సంఘటన స్థలాన్ని సోమవారం పరిశీలించి ప్రమాదంలో మృతి చెందిన సాయివర్ణికతోపాటు ఇద్దరు చిన్నారుల మృతదేహాలను సందర్శించి నివాళులర్పించారు. ఘటనలో మృతి చెందిన వారి కుటుంబానికి ప్రభుత్వపరంగా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వ్యక్తిగతంగా మృతుల కుటుంబానికి రూ.50 వేల నగదు అందించారు. పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాలను బంధువులకు అప్పగించే ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ఎంపీ మోపిదేవి వెంట బోటు ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మోపిదేవి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యుడు నర్రా సుబ్బయ్య తదితరులు ఉన్నారు.





ఘటనా స్థలంలో మృతదేహాలను పరిశీలించి, వివరాలు అడిగి తెలుసుకుంటున్న ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు తదితరులు (ఇన్‌సెట్) చిన్నారి కొక్కిలిగడ్డ తరుణేశ్వర్ మృతదేహం

అలంకార శోభితుడైన శ్రీరామలింగేశ్వరుడు



శ్రావణమాసాన్ని పురస్కరించుకుని స్థానిక శ్రీరామ పాదక్షేత్రం వద్ద కృష్ణానదిలోని మండపంలో శ్రీగంగ, పార్వతి సమేత రామలింగేశ్వరుడికి సోమవారం భక్తులు విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అంబా సాయికిరణ్ శర్మ బ్రహ్మత్వంలో శ్రీరామలింగేశ్వరుడి అలంకారం భక్తుల్లో భక్త పారవశ్యం నింపింది. తొలుత క్షేత్రం చైర్మన్ ఆలూరి శ్రీనివాసరావు పర్యవేక్షణలో భక్తులు సామూహిక పూజలు చేసి, శివలింగానికి పసుపు, కుంకుమ, విభూది, నారికేళ, గోక్షీరం తదితర ద్రవ్యాలతో అభిషేకించారు.

– నాగాయలంక(అవనిగడ్డ)

1 నుంచి ఎంబీబీఎస్ తరగతులు

చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నం ప్రభుత్వ వైద్యకళాశాలలో సెప్టెంబర్ ఒకటో తేదీ నుంచి ఎంబీబీఎస్ విద్యార్థులకు తరగతులు ప్రారంభమవుతాయని కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు తెలిపారు. మెడికల్ కళాశాల నిర్మాణం, తదితర అంశాలకు సంబంధించి అధికారులతో ఆయన సోమవారం తన చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రాజాబాబు మాట్లాడుతూ.. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వసతి సౌకర్యాలను పూర్తి చేయాలన్నారు. కళాశాలకు సంబంధించి ప్రారంభ దశలో ఇప్పటి వరకు 64 మంది విద్యార్థులు చేరారన్నారు. విద్యార్థులకు వసతి కల్పించేందుకు నిర్మించిన వసతిగృహాలు, గ్యాలరీల నిర్మాణాల పురోగతిపై ఆరాతీశారు. విద్యార్థులు బస చేసేందుకు వసతిగృహాల్లో విద్యుత్, తాగునీటి సౌకర్యం పూర్తిస్థాయిలో కల్పించాలని సూచించారు. నీటి సరఫరా కోసం శాశ్వత పైప్‌లైన్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కళాశాలలో గ్రౌండ్ ఫ్లోర్, ఫస్ట్ ఫ్లోర్‌లో పనులు పూర్తయ్యాయని వివరించారు. ఈ నెలాఖరులోగా పనులు పూర్తి చేసి భవనాలు కళాశాలకు అప్పగిస్తామని ఇంజినీరింగ్ అధికారులు కలెక్టర్‌కు తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటు, లిఫ్ట్ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు. కళాశాల నిర్వహణ కోసం ఇప్పటి వరకు భర్తీ చేసిన పోస్టులు, ఇంకా చేయాల్సినవి, అవసరమైన సిబ్బంది వివరాలతో వెంటనే నివేదిక సమర్పించాలని ప్రిన్సిపాల్‌ను కోరారు. సమావేశంలో ఏపీ మెడికల్, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ ఎస్‌ఈ బలరాంరెడ్డి, ఈఈ రవీంద్రబాబు, కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమారి, వైస్ ప్రిన్సిపాల్ ఆశాలత, మేఘా సంస్థ ఇంజినీర్లు జగదీష్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు

న్యూస్‌రీల్

మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడుకు స్వాగతం



గుంటూరుఎడ్యుకేషన్: సోమవారం గుంటూరుకు వచ్చిన మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడుకు గోరంట్లలోని భాష్యం రామసేతు క్యాంపస్ వద్ద గుంటూరు ఆర్డీఓ ఎం.ప్రభాకర్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. భాష్యం విద్యాసంస్థ ఏర్పాటు చేసిన విద్యార్థుల అభినందన సభలో పాల్గొన్న వెంకయ్యనాయుడు అనంతరం గుంటూరు నుంచి కృష్ణా జిల్లా ఆత్కూరులోని స్వర్ణభారత్ ట్రస్ట్‌కు బయలుదేరి వెళ్లారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు దరఖాస్తులకు ఆహ్వానం

నరసరావుపేట ఈస్ట్: పల్నాడు జిల్లా పరిధిలో అన్ని ప్రభుత్వ యాజమాన్యాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఈనెల 24వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పది సంవత్సరాల సర్వీసు పూర్తి చేసిన మండల పరిధిలోని ఉపాధ్యాయులు మండల విద్యాశాఖాధికారి కార్యాలయంలోనూ, డివిజన్ పరిధిలోని ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు ఆయా డివిజన్‌లోని ఉప విద్యాశాఖాధికారికి తమ దరఖాస్తులను అందచేయాలని తెలిపారు.

టీటీడీ కల్యాణ మండపం నిర్మాణానికి రూ.2 కోట్లు మంజూరు



క్రోసూరు: టీటీడీ ఆధ్వర్యంలో క్రోసూరు మండలంలో కల్యాణం మండపం నిర్మాణానికి రూ.2 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు తెలిపారు. క్రోసూరులో ఎకరం స్థలం తోపాటు, మంజూరైన గ్రాంటులో 20 శాతం షేర్ ధనాన్ని సమకూర్చుకోవాల్సి ఉంటుంది. త్వరగా కల్యాణ మండపం నిర్మాణం చేపట్టేందుకు ఎమ్మెల్యే స్థలాల పరిశీలన ప్రారంభించారు. క్రోసూరు–అమరావతి రోడ్డులో 4.81 ఎకరాలు, పక్కనే 0.78 సెంట్ల దేవదాయశాఖకు చెందిన వీరభద్రమల్లికార్జునస్వామి దేవస్థానం భూమిని పరిశీలించారు. దేవదాయశాఖ అనుమతులు ఇచ్చిన వెంటనే నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు.

కాపు నేస్తం కింద 13,405 మందికి రూ.20.11కోట్లు

నరసరావుపేట: పల్నాడు జిల్లాలో 13,405 మంది కాపు, బలిజ, ఒంటరి, తెలగ కులాలకు చెందిన మహిళలకు కాపు నేస్తం పథకం కింద రూ.20.11కోట్లు రాష్ట్ర ప్రభుత్వం అందజేయనున్నట్లు జిల్లా బీసీ కార్పొరేషన్ పీడీ డి.దుర్గాభాయి సోమవారం పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆయా కులాలకు చెందిన 45 ఏళ్ల నుంచి 60 ఏళ్ల మధ్యనున్న మహిళలకు ఏడాదికి రూ.15వేలు చొప్పున ఐదేళ్లకు రూ.75వేలు అందజేస్తున్నారన్నారు. ఇప్పటివరకు ఒకటి, రెండు, మూడు విడతలుగా జిల్లాలోని 31,569 మందికి రూ.45.39 కోట్లు అందజేశారన్నారు. ఈనెల 30వ తేదీన తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులో జరిగే కార్యక్రమంలో నాల్గవ విడత నిధులు మంజూరు చేస్తారని ఆమె తెలియచేశారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 521.00 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ప్రధాన జలవిద్యుత్ కేంద్రానికి 10,192, ఎస్‌ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 858.90 అడుగుల వద్ద ఉంది.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 4,513 క్యూసెక్కులు విడుదల చేశారు. హై లెవల్ కాలువకు 120, బ్యాంక్ కెనాల్‌కు 1290, తూర్పు కెనాల్‌కు 563, పశ్చిమ కెనాల్‌కు 130, నిజాంపట్నం కాలువకు 245, కొమ్మమూరు కాల్వకు 1983 క్యూసెక్కులు విడుదల చేశారు.

ధాన్యం కొనుగోలుకు తోడ్పాటు అందించాలి


జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాదు

నరసరావుపేట: ప్రతి మిల్లర్ తమ మిల్లులో డ్రయర్లు ఏర్పాటుచేసి 2023-24 ధాన్యం కొనుగోలు ప్రక్రియకు తోడ్పాటు అందజేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాదు మిల్లర్లను కోరారు. సోమవారం సాయంత్రం తన ఛాంబర్‌లో జిల్లాలోని మిల్లర్లు, పౌరసరఫరాల శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. 2023-24 ఏడాదికి పెరిగిన ధాన్యం మద్దతు ధర రూ.143లు తాము పండించిన ధాన్యం విక్రయించటంలో రైతులతు ఆశాజనకంగా ఉంటుందన్నారు. మిల్లర్లు కస్టమ్ మిల్లింగ్ ప్రక్రియ(కేఎస్ఎం)లో పాల్గొనాలంటే ప్రతి మిల్లులో సీసీ కెమెరాలు, ఇంటర్నెట్ కనెక్షన్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. గతేడాది 51మంది మిల్లర్లు కేఎస్ఎంలో పాల్గొన్నారన్నారు. వాటికి సంబంధించిన మిల్లింగ్, సార్టెక్స్ చార్జీలు, డ్రయేజు, బియ్యం రవాణాకు సంబంధించిన రూ.7కోట్లకు బిల్లులు డీఎం కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. ధాన్యం సేకరణకు కావాల్సిన ఒక లక్ష గోనె సంచులు రైతు భరోసా కేంద్రాలలో ఏర్పాటుచేయాలని ఆదేశించారు. జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఎస్.పద్మశ్రీ, జిల్లా మేనేజర్ జి.వరలక్ష్మి పాల్గొన్నారు.

ఎన్నారై డాక్టర్ పొదిల ప్రసాద్‌కు మాతృవియోగం

గుంటూరు మెడికల్ : ప్రవాసాంధ్రుడు, గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల మిలీనియం బ్లాక్ నిర్మాత డాక్టర్ పొదిల ప్రసాద్ మాతృమూర్తి పొదిల హైమావతి (80) సోమవారం గుంటూరులో మృతి చెందారు. డాక్టర్ ప్రసాద్ స్వగ్రామం సత్తెనపల్లి మండలం ఫణిదంలో మంగళవారం అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. ఏడాది క్రితం ప్రసాద్ తండ్రి రత్తయ్య మృతి చెందారు. హైమావతి మృతికి పలువురు వైద్యులు, ప్రవాసాంధ్రులు, రాజకీయ ప్రముఖులు సంతాపం తెలిపారు.

కార్యకర్త కుటుంబానికి రూ.5.5 లక్షల ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

కారెంపూడి: వైఎస్సార్ సీపీ కార్యకర్త వైద్య ఖర్చుల నిమిత్తం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున రూ. 5,50,000 ఆర్థిక సాయాన్ని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోమవారం కుటుంబ సభ్యులకు అందించారు. మండలంలోని పెదకొదమగుండ్ల గ్రామ శివారు కాకానివారిపాలెం ఎస్సీ కాలనీకి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త సాగర్ బాబు ఇటీవల గ్రామంలో కరెంటు పని చేస్తూ కరెంటు స్తంభం మీద నుంచి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు. వైద్యం చేయించుకోలేని స్థితిలో ఉన్న సాగర్ బాబు కుటుంబ సభ్యులకు ప్రభుత్వ విప్ రామకృష్ణారెడ్డి పెద్ద మొత్తంలో పార్టీ తరఫున సాయం అందించారు. ఎంపీపీ మేకల శారదా శ్రీనివాసరెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్‌లు మందాళ్ల అంజిరెడ్డి, అల్లు వెంకటేశ్వరరెడ్డి, కారెంపూడి సర్పంచ్ రమావతు ప్రమీలాభాయి తేజానాయక్, ఆర్యవైశ్య సంఘం మాజీ మండల అధ్యక్షుడు వెలుగూరి శేషారావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు సత్వరమే పూర్తిచేయండి

సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట: మంచి గుర్తింపు వచ్చేలా ప్రగతి పథకాల పనులను నిర్దిష్ట కాల పరిమితిలోపు పూర్తిచేయడం, నిరంతర పనులను సత్వరం కొనసాగించడం చేయాలని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో సోమవారం జిల్లా అధికారులతో సమీక్ష, మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పని తీరుపై చర్చించారు. ప్రధానంగా జిల్లాలో ఎంతమంది గర్భిణులు వైఎస్సార్ సంపూర్ణ పోషణ తీసుకుంటున్నారని ప్రశ్నించి, వాటిని ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. బరువు, ఎత్తు తక్కువ ఉన్న పిల్లలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ అందుతుందా లేదా అని అడిగి తెలుసుకున్నారు. టేక్ హోమ్ రేషన్ ద్వారా ప్రతీ ఇంటికీ రేషన్ పంపిణీ కార్యక్రమంపై ఆరా తీశారు. ఫ్యామిలీ డాక్టర్ అమలులో వెనుకబడ్డ మండలాలను ప్రోగ్రెస్‌లోని తీసుకురావాలని, ప్రతి ఇంటికి తిరిగి ఫీవర్ సర్వే పూర్తిచేయాలని ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్యను పెంచాలన్నారు. గృహ నిర్మాణ పథకాలలో జగనన్న కాలనీలో ఇల్లు నిర్మించుకుంటూ లబ్ధిదారుల ఇళ్లకు మంచినీరు, విద్యుత్ సౌకర్యం కల్పించేందుకు సంబంధించిన సర్వేను పూర్తిచేసి, యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. రక్తహీనతతో బాధపడుతున్న బాలికలకు ఐరన్ ఫోలిక్ మాత్రలు జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో పంపిణీ చేసి బాలికలు వేసుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. నాడు-నేడు పనుల్లో నాణ్యత ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని, ఫేజ్-2 పనుల ఫొటోలు ప్రతీవారం తప్పని సరిగా అప్‌లోడ్ చేయాలన్నారు. రీ సర్వే పనుల ప్రక్రియలో భూముల హద్దు రాళ్లు వంద శాతం పూర్తిచేయాలని సూచించారు. ప్రతలి బుధవారం మండల పరిషత్ అధికారులు, తహసీల్దార్లు జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై సమీక్ష నిర్వహించి సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్, ఆయా శాఖల జిల్లా, మండల అధికారులు పాల్గొన్నారు.

26న మెగా జాబ్ మేళా

నరసరావుపేట ఈస్ట్: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ స్కిల్ డెవలప్‌మెంట్ అండ్ ట్రైనింగ్ సహకారంతో ఈనెల 26వ తేదీన మాచర్లలో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి కె.సంజీవరావు సోమవారం తెలిపారు. జిల్లా కలెక్టర్ లోతేటి శివశంకర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ విప్, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పర్యవేక్షణలో మాచర్లలోని చక్రధర్ డిగ్రీ కళాశాల ఆవరణలో జాబ్ మేళా ఏర్పాటు చేసినట్టు వివరించారు. జాబ్ మేళాలో మాస్టర్ మైండ్స్, ఆపెక్స్ సొల్యూషన్స్, స్కిల్ క్రాఫ్ట్, ఫ్లిప్‌కార్ట్, తోషిబా వంటి పలు రకాల కంపెనీలు హాజరై ఉద్యోగులను ఎంపిక చేసుకుంటాయని తెలిపారు. జాబ్ మేళాకు పదవ తరగతి నుంచి డిగ్రీ, బీటెక్, ఫార్మసీ, ఐటీఐ, డిప్లొమో విద్యార్థులు హాజరు కావచ్చని తెలిపారు. వివరాలకు ఆర్.కిరణ్‌నాయక్ 9842747682, పి.శ్రీకాంత్ 9492158153, నానికా నాయక్ 9010585360, ఖాదర్‌బాషా 9440988148 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఫిర్యాదుల పరిష్కారానికి తొలి ప్రాధాన్యం

'జిల్లా ఎస్పీ జగనన్నకు చెబుదాం'లో 43 ఫిర్యాదులు స్వీకరణ



ఫిర్యాదుదారుల సమస్యలు వింటున్న జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

నరసరావుపేట: ప్రజల ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి త్వరితగతిన పరిష్కరించే విధంగా తక్షణ చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రతి ఫిర్యాదు దారుని సమస్యపై శ్రద్ధ వహించి, నిర్ణీత గడువులోగా పరిష్కరించడానికి కృషిచేయాలని సూచించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాంలో పాల్గొని 43 ఫిర్యాదులు స్వీకరించారు. స్వీకరించిన వాటిలో కుటుంబ, ఆర్థిక, ఆస్తి తగాదాలు, పొలం, ఆర్థిక పరమైన సమస్యలకు సంబంధించి ఫిర్యాదులు ఉన్నాయి. ఫిర్యాదులను రాసిపెట్టడంలో పోలీస్ సిబ్బంది సహకారం అందజేశారు. నకరికల్లు మండలం చల్లగుండ్ల గ్రామానికి చెందిన అన్నపూర్ణ రైస్ ట్రేడర్స్ టి.శ్రీనివాసరావు, వాణి చేసిన సహాయంతో ప్రవల్లికా సత్యం, పాల్వాది మధుసూదన్‌రావు, చిన్ని వెంకట శ్రీనివాస్‌రావులు ప్రజలకు భోజన కార్యక్రమం నిర్వహించారు. అదనపు ఎస్పీ(అడ్మిన్) ఆర్.రాఘవేంద్ర, ఏఆర్ అదనపు ఎస్పీ డి.రామచంద్రరాజు, క్రైమ్ అదనపు ఎస్పీ ఎస్.కె చంద్రశేఖర్, డీఎస్పీలు కె.వి.మహేష్, పల్లపురాజు, బి.ఆదినారాయణ, యు.రవిచంద్ర, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

సర్వే అంటే కేసు పెడతామని బెదిరిస్తున్నారు

నాకు రెండెకరాల పొలం ఉంది. అందులోని 20సెంట్లను పొలం పక్కనే ఉన్న అతను కలుపుకొన్నాడు. ఇరువురి పొలం నిర్ధారణ కోసం సర్వేయర్ వస్తే అతడిని కొలతలు తీయనీయకుండా మాపై కేసు పెడతామంటూ దౌర్జన్యం చేస్తున్నారు. పోలీసులు సైతం సహకరించడం లేదు. సర్వే చేసేందుకు తగిన రక్షణ కల్పించండి.

– పి.అనూరాధ, గ్రంథశిరి, అచ్చంపేట

ఆట్యా-పాట్యా రాష్ట్రస్థాయి విజేతలుగా జిల్లా జట్లు



విజేతలుగా నిలిచిన జిల్లా బాలుర జట్టుకు ట్రోఫీని అందజేస్తున్న దృశ్యం

నరసరావుపేట రూరల్: రాష్ట్రస్థాయి ఆట్యా - పాట్యా పోటీలలో పల్నాడు జిల్లా బాలబాలికల జట్లు విజేతలుగా నిలిచాయి. ఈనెల 18వ తేదీ నుంచి 20వరకు కర్నూలులో జరిగిన 8వ రాష్ట్రస్థాయి ఆట్యా-పాట్యా పోటీల ఫైనల్లో బాలుర, బాలికల జట్లు అనకాపల్లి జట్లపై విజయం సాధించి చాంపియన్‌గా నిలిచాయి. విజేతలుగా నిలిచిన జిల్లా జట్లకు న్యాయవాది శ్రీధర్‌రెడ్డి, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు ట్రోఫీలతో పాటు పతకాలు అందజేశారు. జిల్లా జట్ల కోచ్‌లుగా సిహెచ్ పుల్లయ్య, జి.ఝాన్సీరాణిలు వ్యవహరించారు.

కేఎల్‌యూలో న్యూరో సైన్స్ కార్యశాల



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ అనితా మహదేవన్, డాక్టర్ కె.ఎస్. జగన్నాథరావు, డాక్టర్ కె. సుబ్బారావు

తాడేపల్లిరూరల్ : గుంటూరు జిల్లా వడ్డేశ్వరంలోని కేఎల్ విశ్వవిద్యాలయంలో అంతర్జాతీయ న్యూరో సైన్స్ కార్యశాలను సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం. శ్రీనివాస్, మైసూర్ జెఎస్ఎస్ మెడికల్ కళాశాల ఆచార్యులు డాక్టర్ టీఎస్ఎస్ రావు, బెంగళూరులోని నిమ్‌హాన్స్ మానవ మెదడు బ్యాంక్ డైరెక్టర్ అనితా మహదేవన్, హనుమ శ్రీనివాసరెడ్డిలు ముఖ్య అతిథులుగా విచ్చేశారు.

ఈ సందర్భంగా ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం. శ్రీనివాసరావు మాట్లాడుతూ మానవ మెదడులా పని చేసే విధంగా మదర్‌బోర్డు రూపకల్పనకు ఇప్పటికే రోడ్‌మ్యాప్ సిద్ధమైందన్నారు. మానవులకు ఉన్న విధంగా భావోద్వేగాలు లేనప్పటికీ యాంత్రికంగా అవయవాలను కదిలించడం, పనిచేయడం వంటి పలు రకాల పరిశోధనలు ఇప్పటికే విజయవంతమైనాయన్నారు. కె.ఎల్.వర్సిటీ ప్రొ చాన్సలర్ డాక్టర్ కెఎస్ జగన్నాథరావు మాట్లాడుతూ కృత్రిమ మేధస్సుతో మానవ మెదడులో తలెత్తే సమస్యలకు పరిష్కారం కనుగొనడానికి ప్రపంచస్థాయిలో జరుగుతున్న పరిశోధనల కోసం కేఎల్‌యూలో అంతర్జాతీయ కార్యశాల నిర్వహించడం కోసం చైర్మన్ కోనేరు సత్యనారాయణ ఎంతో శ్రద్ధ తీసుకుంటున్నారని, ఈ కార్యశాల ఐదు రోజుల పాటు నిర్వహించనున్నా మన్నారు. అనంతరం ఎయిమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఎం. శ్రీనివాస్, మైసూర్ జెఎస్ఎస్ మెడికల్ కళాశాల ఆచార్యులు డాక్టర్ టిఎస్ఎస్ రావు, డాక్టర్ మురళీధర్ హెగ్డే, జపాన్‌కు చెందిన శామ్యూల్ జెకె అబ్రహాం, డాక్టర్ శ్రీనివాస్ చక్రవర్తి, హనుమ శ్రీనివాసరెడ్డి, బెంగళూరులోని నిమ్‌హాన్స్ మానవ మెదడు బ్యాంక్ డైరెక్టర్ అనితా మహదేవన్‌లను సర్‌సివి రామన్ అవార్డులను అందజేసి ఘనంగా సత్కరించారు.

ఈ కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్‌రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, బయో టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ కె. శ్రీనివాసులు, ఇసిఇ విభాగాధిపతి డాక్టర్ ఎం. సుమన్, కార్యక్రమ ముఖ్య ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ ఎం. వసుజాదేవి, కో ఆర్డినేటర్లు ఆచార్యులు శ్రీకాంత్ రెడ్డి, లక్ష్మి సౌమ్య, సోభారాణి తదితరులు పాల్గొన్నారు.

సెంట్రల్ జోన్ జట్టుపై నార్త్‌జోన్ విజయం



97 పరుగులు సాధించిన వి.స్నేహదీప్తి



80 పరుగులు సాధించిన ఎస్.హిమబిందు



57 పరుగులు సాధించిన వి.పుష్పలత

మంగళగిరి: కార్పొరేషన్ పరిధి నవులూరు ఆంధ్రాక్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో సోమవారం జరిగిన ఏసీఏ సీనియర్ ఉమెన్ ఇంటర్ జోనల్స్ వన్డే మ్యాచ్‌లో సెంట్రల్ జోన్ జట్టుపై నార్త్ జోన్ జట్టు 102 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న నార్త్ జోన్ జట్టు 49 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 308 పరుగులు సాధించింది. జట్టు బ్యాట్స్ ఉమెన్లు వి.స్నేహదీప్తి 65 బంతుల్లో మూడు సిక్సులు, 13 ఫోర్లతో 97 పరుగులు సాధించింది. మరో బ్యాట్స్ ఉమెన్ ఎస్.హిమబిందు 80 బంతుల్లో ఒక సిక్సు, ఎనిమిది ఫోర్లతో 80 పరుగులు సాధించగా వి.పుష్పలత 70 బంతుల్లో ఆరు ఫోర్లతో 57 పరుగులు చేసింది. సెంట్రల్ జోన్ బౌలర్ కె.వాసవి 10 ఓవర్లలో 53 పరుగులిచ్చి రెండు వికెట్లను సాధించింది. అనంతరం 309 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్ చేపట్టిన సెంట్రల్ జోన్ జట్టు 47 ఓవర్లలో 194 పరుగులకు ఆలౌటైంది. జట్టు బ్యాట్స్ ఉమెన్ కేఈ డయానా 49 బంతుల్లో తొమ్మిది ఫోర్లతో 61 పరుగులు, జి.సింధూజ 71 బంతుల్లో మూడు ఫోర్లతో 34 పరుగులు, హెన్రితా పెరెరా 41 బంతుల్లో మూడు ఫోర్లతో 32 పరుగులు చేశారు. నార్త్‌జోన్ బౌలర్లు ఎండీ షబ్నమ్ ఏడు ఓవర్లలో 41 పరుగులిచ్చి రెండు వికెట్లు, కె.జ్యోతి తొమ్మిది ఓవర్లలో 36 పరుగులిచ్చి రెండు వికెట్లు, బి.నవ్య ఏడు ఓవర్లలో 19 పరుగులిచ్చి రెండు వికెట్లను పడగొట్టారు.

జిల్లా జైలులో పెట్రోల్ బంక్‌కు శంకుస్థాపన



శిలా ఫలకాన్ని, ఎఫ్ఐసీటీసీ సెంటర్‌ను ప్రారంభిస్తున్న హరీష్ కుమార్ గుప్తా, జైళ్ల శాఖ అధికారులు

గుంటూరు లీగల్: గుంటూరు జిల్లా జైలులో జైళ్ల శాఖ, హెచ్‌పీసీఎల్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో పెట్రోలు బంక్ నిర్మాణానికి హోం శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ హరీష్ కుమార్ గుప్తా సోమవారం భూమి పూజ నిర్వహించి శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కారాగారంలోని ముద్దాయిలకు వ్యాధుల నిర్ధారణ నిమిత్తం వివిధ రక్త పరీక్షల ల్యాబ్, ఎఫ్ఐసీటీసీ సెంటర్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో గుంటూరు రేంజ్ జైళ్ల ఉప శాఖాధికారి ఎం.వరప్రసాద్, హెచ్‌పీసీఎల్ సౌత్ సెంట్రల్ జోన్ డిప్యూటీ జనరల్ మేనేజర్ పి.కాశీ విశ్వనాథం, చీఫ్ రీజినల్ మేనేజర్ రిటైల్ ఆదిత్యనాథ్, చీఫ్ మేనేజర్ విల్సన్ బాబు, డిప్యూటీ జనరల్ మేనేజర్ ఆర్.ఈ. రెబ్బా అంబేడ్కర్, జిల్లా జైలు పర్యవేక్షణాధికారి కె.రఘు, జిల్లా సబ్ జైళ్ల అధికారి ఆర్.వీరేంద్ర ప్రసాద్, కారాగార వైద్యాధికారి కె.లక్ష్మీ పూర్ణలత, జైలర్లు బి.తేజేశ్వరరావు, సీహెచ్ కిరణ్, ప్రేమ సాగర్, డిప్యూటీ జైలర్లు టి.వెంకటరత్నం, బి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

డీఎల్ఎస్ఏ కార్యకలాపాలపై పీడీజే సమీక్ష

గుంటూరు లీగల్: జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యకలాపాలపై జిల్లా ప్రధాన న్యాయమూర్తి (పీడీజే) వై.వి.ఎస్.బి.జి. పార్థసారథి సోమవారం తన ఛాంబర్‌లో సమీక్షించారు. నల్సా కార్యక్రమంలో భాగంగా నిర్వహించే లోక్ అదాలత్‌లు, లీగల్ ఎయిడ్ క్యాంపులు, బాధితులకు నష్ట పరిహారం చెల్లింపు తదితర అంశాలకు సంబంధించి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పార్థసారథి సమీక్షించి తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు అందించారు. సమీక్షా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి, జిల్లా ఎస్పీ ఆరీఫ్ హఫీజ్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి చంద్రమౌళీశ్వరి పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న టిప్పర్.. మహిళ మృతి

8 మందికి గాయాలు



సలోమి మృతదేహం

సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందగా 8 మందికి గాయాలైన సంఘటన సత్తెనపల్లి మండలం పాకాలపాడు గ్రామం వద్ద ఆదివారం అర్ధరాత్రి జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. క్రోసూరు మండలం 88 త్యాళ్లూరుకు చెందిన గ్రామస్తులు గుంటూరు సమీపంలోని దాసరిపాలెం వద్ద చర్చి ప్రారంభోత్సవానికి హాజరయ్యేందుకు ఆటోలో వెళ్లారు. తిరిగి ఆటోలో 88 త్యాళ్లూరు వస్తుండగా పాకాలపాడు సమీపంలో వెనుక నుంచి వచ్చిన టిప్పర్ ఢీ కొట్టడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఘటనలో మాలిశెట్టి సలోమి (38) అక్కడికక్కడే మృతి చెందగా, 8 మందికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించారు. సత్తెనపల్లి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ దుర్మరణం

- భర్త, కుమారుడికి తీవ్రగాయాలు
- కుమారుడిని కళాశాలలో దింపేందుకు వెళుతుండగా ఘటన



సంఘటనా స్థలంలో పడి ఉన్న మంగమ్మ మృతదేహం

సత్తెనపల్లి: రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందిన సంఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం ధూళ్లిపాళ్ల సమీపంలోని బృగుబండ క్రాస్ రోడ్డు వద్ద సోమవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు గడ్డం కోటేశ్వరరావు, ఆయన భార్య గడ్డం పున్నమ్మ (48), కుమారుడు రవి కిషోర్‌లు ద్విచక్ర వాహనంపై గుంటూరు వెళుతున్నారు. గుంటూరులో తమ కుమారుడు రవికిషోర్ బీటెక్ చదువుతుండగా ఆ కళాశాలలో దింపేందుకు వెళుతున్నారు. ఈ క్రమంలో సత్తెనపల్లి నుంచి కారు బృగుబండ గ్రామం వైపు వెళుతుంది. బృగుబండ క్రాస్ రోడ్ వద్ద కారును ద్విచక్ర వాహనం ఢీకొట్టడంతో పున్నమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. కోటేశ్వరరావుకు, కుమారుడు రవి కిషోర్‌కు తీవ్ర గాయాలు కావడంతో క్షతగాత్రులను చికిత్స నిమిత్తం వైద్యశాలకు తరలించారు. సత్తెనపల్లి రూరల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. తమ కళ్లముందే భార్య మృతి చెందడంతో పాటు కుమారుడికి, తనకు తీవ్రగాయాలు కావడంతో కోటేశ్వరరావు కన్నీరు మున్నీరయ్యారు. ఆయన రోదన చూపరులకు సైతం కంటతడి పెట్టించింది.

మార్కెట్లోకి 'కట్లాస్' కీటకనాశిని

కొరిటిపాడు(గుంటూరు): అంతర్జాతీయ ప్రమాణాలతో అధునాతన సాంకేతిక పరిశోధనతో రూపొందించబడిన పారిజాత్ ఇండస్ట్రీస్ వారి కీటకనాశిని 'కట్లాస్' పురుగు మందును స్థానిక అరండల్‌పేటలోని ఓ హోటల్‌లో సోమవారం కంపెనీ సౌత్ డీజీఎం యు.శ్రీనివాసులు రెడ్డి, జోనల్ హెడ్ ఎ.రమణారెడ్డిలు మార్కెట్‌లోకి విడుదల చేశారు. దీంతోపాటు వరిలో కలుపునాశిని 'దహన్', వాణిజ్య పంటలో వచ్చు కీటకనాశిని 'అబాడన్'లను కూడా మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా సౌత్ డీజీఎం శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ అన్ని రకాల క్రిమి సంహారక మందులతో పాటు మొక్కలకు పోషకాలు అందించే ఉత్పత్తుల పోర్ట్‌పోలియో పారిజాతంను ప్రత్యేకంగా పేర్కొన్నారు. జోనల్ హెడ్ రమణారెడ్డి మాట్లాడుతూ 'కట్లాస్' కీటకనాశిని శ్రేణిలో అద్భుతమైన క్రిమిసంహారి మందు అని తెలిపారు. మిరప పంటలో నల్లి ప్రభావం ఎక్కువగా ఉంటుందని దాని నివారణలో కట్లాస్ సమర్థవంతంగా పనిచేస్తూ దీర్ఘకాలం పాటు పంటను నియంత్రించడమే కాకుండా పంటకు పూర్తి సంరక్షణ ఇస్తుందన్నారు. కార్యక్రమంలో కంపెనీ బిజినెస్ యూనిట్ సేల్స్ టీం, ఎఎస్ఓస్, డిస్ట్రిబ్యూటర్లు, డీలర్లు పాల్గొన్నారు.

సాగులో సందేహాలను నివృత్తి చేయాలి

జిల్లా వ్యవసాయ అధికారి అబ్దుల్ సత్తార్

రేపల్లె: రైతులకు వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉంటూ సాగులో కలిగే సందేహాలను నివృత్తి చేయాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి అబ్దుల్ సత్తార్ తెలిపారు. వివిధ వ్యవసాయ అంశాలపై స్థానిక వ్యవసాయ కార్యాలయంలో రేపల్లె, నిజాంపట్నం, చెరుకుపల్లి మండలాల వ్యవసాయ అధికారులకు సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖరీఫ్‌లో సాగు చేస్తున్న పంట వివరాలు రైతు భరోసా కేంద్రాలలో నమోదు చేయించుకునేలా అధికారులు రైతులను చైతన్య పరచాలన్నారు. ప్రకృతి విపత్తుల సమయంలో పంట నష్టం వాటిల్లిన రైతులను ఆదుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకున్న రైతులు మాత్రమే ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, ఇన్‌పుట్ సబ్సిడీ, ఆర్‌బీకేల ద్వారా అందించే ఎరువులు, యంత్ర పరికరాలకు అర్హులు అవుతారని తెలియజెప్పాలన్నారు. అనంతరం ఆయా అంశాలపై వ్యవసాయ అధికారులకు శిక్షణ నిచ్చారు. ఏడీఏ అక్తర్ హుస్సేన్, ఏఓలు శారద, వాగోలు బుష్, ఏఈఓలు పాల్గొన్నారు.